జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | 28 | సెప్టెంబర్ | 2025 ♦ పేజీలు : 6

## భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి

- నీటిపారుదల అధికారుల నిర్లక్ష్యంతో నీట మునిగిన రామాలయ నిత్యన్నదాన సత్రం
- రామాలయ పరిసరాలు మురికి నీటిలోనే
- భద్రాచలం నుంచి చర్ల, కూనవరం మార్గాల్లో రోడ్లపైకి వరద నీరు
- గోదావరికి కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక







ప్రజాజ్యోతి
27 Sep 2025 - Page 1

చుంచుపల్లి ఎస్ఐ...

అడ్డగోలు వసూళ్లు..

- కిరాణ షాప్ వద్ద యువకులపై దౌర్జన్యం
- అర్ధరాత్రి ఆటోస్టాండ్ వద్ద సెటిల్మెంట్
- ఫోన్ పే ట్రాన్సాక్షన్ వివరాలు ఆధారాలుగా ఉన్నాయంటూ సమాచారం
- ఉన్నతాధికారుల చర్యలకోసం ప్రజలు డిమాండ్

ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు, చట్టం కాపా డాల్సిన అధికారులు ప్రజలపైనే దాడి చేసి డబ్బు లాక్కుంటే పరిస్థితి ఎటు దారితీస్తుందో అర్థం చేసుకో వడం కష్టం కాదు. ... క్రమంలో యువకుల ఫోన్లు లాక్కొని స్టేషన్ కు తీసుకెళ్లి, వాటిని తిరిగి ఇవ్వాలంటే ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు చెల్లించాలంటూ డిమాండ్ చేసినట్లు తెలిపారు.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

2 లో..

# కోర్టుకు రావాలంటూ..
# కొత్త ఆదేశం...

- బాధితులపై కొత్త ఒత్తిడి పద్ధతులు
- కోర్టు పేరుతో మళ్లీ ఇబ్బందులు
- కానిస్టేబుళ్లపై ఫోన్ పే ఆధారాలు
- ఉన్నతాధికారుల నిశ్శబ్దం ప్రశ్నార్థకం

చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పై వరుస ఆరోపణలు మళ్లీ మళ్లీ బహిర్గతమవుతున్నాయి. గురువారం రాత్రి జరిగిన వసూళ్ల ఘటనతో ప్రజల్లో ఆగ్రహం ఎగసిపడుతుండగానే, శనివారం ఈ అంశం మరో మలుపు తిరిగింది. సాయంత్రం సరిగ్గా 4 గంటల 54 నిమిషాలకు స్టేషన్ లోని ఓ అధికారి నేరుగా ఈ బాధితుల్లో ఒకరికి ఫోన్ చేసి.. "వేణు (పేరు మారుస్తున్నాం) నువ్వు ఎక్కడున్నావ్? అర్జెంట్ గా ఆధార్ కార్డు తీసుకొని కోర్టుకు రా, చలానా కట్టాలి నువ్వు" అంటూ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. బాధితుడు "నేను ఊర్లో లేను సార్" అని చెప్పడంతో ఈ వ్యవహారం సోమవారానికి వాయిదా పడి నట్టు తెలిసింది. అయితే ఈ కొత్త ఆదేశం, గురువారం రాత్రి జరి గిన వసూళ్ల సంఘటనలో బయటపడిన విషయాలపై దృష్టి మరల్చే కొత్త పన్నాగమా? అన్న అనుమానం ఇప్పుడు బలంగా వినిపిస్తోంది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## మావోయిస్టుల ఆర్డినెన్సు ఫ్యాక్టరీ కూల్చివేత

- భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం




**చర్ల, సెప్టెంబర్ 27, (ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లాలోని మెట్టగూడ ప్రాంతంలో భద్రతా దళాల శిబిరం నుండి అందిన నిఘా సమాచారం ఆధారంగా శుక్రవారం జిల్లా దళం సుక్మా కోబ్రా 203 బెటాలియన్ ల సంయుక్త బృందం ఎరాపల్లి కోయిమెంట గ్రామాల చుట్టూ ఉన్న అటవీ–కొండ ప్రాంతంలో భారీ నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్ సమయంలో కోయిమెంటా గ్రామ అడవులలో నక్సలైట్లు నిర్వహిస్తున్న అక్రమ ఆయుధ తయారీ కర్మాగారాన్ని భద్రతా దళాలు విజయవంతంగా కూల్చివేసాయి. భద్రతా దళాలకు నష్టం కలిగించే ఉద్దేశ్యంతో నక్సలైట్లు ఈ కర్మాగారాన్ని స్థాపించారు. ఈ ఆపరేషన్ లో పెద్ద మొత్తంలో ఆయుధాల తయారీ

మిగతా 2 లో...

## అర్ధరాత్రి భారీ వర్షంలోనూ ....

- వెలుగులు నింపిన విద్యుత్ సిబ్బంది



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి:** పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి చెట్ల కొమ్మలు విరిగి కరెంటు తీగలపై పడటంతో పలు కాలనీలు అంధకారంలో మునిగిపోయాయి. ఐటీడీఏ ఆఫీసు సమీపంలో చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్ పై పడటంతో వెంకటేశ్వర కాలనీ, మెడికల్ కాలనీ, ఆదర్శనగర్, రాజీవ్ నగర్, సుందరయ్య నగర్, శ్రీరామ్ నగర్ కాలనీలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో వర్షాన్ని లెక్క చేయకుండా విద్యుత్ శాఖ సిబ్బంది లైన్ ఇన్స్పెక్టర్ పదిలం శ్రీను, లైన్మెన్ త్రినాద్ రెడ్డి , జూనియర్ లైన్మెన్ జగదీష్ రాత్రివేళే ఘటనాస్థలానికి చేరుకుని చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ ను పునరుద్ధరించారు. భారీ వర్షంలోనూ ప్రాణాపాయాన్ని కూడా లెక్క చేయకుండా శ్రమించి ప్రజలకు విద్యుత్ అందించి వృత్తి పట్ల తమకున్న అంకిత భావాన్ని చాటుకున్నారు.




# కోర్టుకు రావాలంటూ.. కొత్త ఆదేశం...

- బాధితులపై కొత్త ఒత్తిడి పద్ధతులు
- కోర్టు పేరుతో మళ్లీ ఇబ్బందులు
- కానిస్టేబుళ్లపై ఫోన్ పే ఆధారాలు
- ఉన్నతాధికారుల నిశ్శబ్దం ప్రశ్నార్థకం

చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పై వరుస ఆరోపణలు మళ్లీ మళ్లీ బహిర్గతమవుతున్నాయి. గురువారం రాత్రి జరిగిన వసూళ్ల ఘటనతో ప్రజల్లో ఆగ్రహం ఎగసిపడుతుండగానే, శనివారం ఈ అంశం మరో మలుపు తిరిగింది. సాయంత్రం సరిగ్గా 4 గంటల 54 నిమిషాలకు స్టేషన్ లోని ఓ అధికారి నేరుగా ఈ బాధితుల్లో ఒకరికి ఫోన్ చేసి.. "వేణు (పేరు మారుస్తున్నాం) నువ్వు ఎక్కడున్నావ్? అర్జెంట్ గా ఆధార్ కార్డు తీసుకొని కోర్టుకు రా, చలానా కట్టాలి నువ్వు" అంటూ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. బాధితుడు "నేను ఊర్లో లేను సార్" అని చెప్పడంతో ఈ వ్యవహారం సోమవారానికి వాయిదా పడినట్టు తెలిసింది. అయితే ఈ కొత్త ఆదేశం, గురువారం రాత్రి జరిగిన వసూళ్ల సంఘటనలో బయటపడిన విషయాలపై దృష్టి మరల్చే కొత్త పన్నాగమా? అన్న అనుమానం ఇప్పుడు బలంగా వినిపిస్తోంది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఎందుకంటే ఆ రాత్రి ఇద్దరు కానిస్టేబుళ్లు బాధితులను, ఇద్దరు చిన్నారులతో కూడిన తల్లిని ఇంటికి వెళ్లనీయకుండా అర్ధరాత్రి ఒకటిగంట వరకు అటు ఇటు తిప్పుతూ ఫోన్లు లాక్కొని, డబ్బులు బలవంతంగా వసూలు చేసినట్టు ఆధారాలతో కూడిన సంచారం బయటకు వచ్చాయి. అందులోను అర్ధరాత్రి 12 గంటల 58 నిమిషాలకు ఓ బాధితుడి నెంబర్ నుండి కానిస్టేబుల్ కు 'ఫోన్ పే' ద్వారా చెల్లింపులు జరిగాయని ఆధారాలు ఉన్నాయన్న విషయం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఇంత స్పష్టమైన డేటా బయటకు వచ్చినా, ఆ సిబ్బంది పై అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. అసలు మొన్నటి రాత్రి వసూళ్ల దోపిడీపై జనాలు ఆగ్రహంతో మండిపడుతుంటే, శనివారం అకస్మాత్తుగా కోర్టు పేరుతో కొత్త ఆదేశం ఎందుకు వచ్చిందో ఎవరికీ అర్థం కావడం లేదు. దీంతో ఇదంతా బాధితులను మరింత ఒత్తిడికి గురిచేసి అసలు విషయాన్ని పక్కకు నెట్టే పన్నాగమే కాదా? అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇక చుంచుపల్లి స్టేషన్ లో ఇలాంటి ఘటనలు ఇది ఒక్కటే కావని కొందరు బాధితులు చెబుతున్నారు. కొన్ని నెలల క్రితం ఒక మహిళ తన భర్త అక్రమ సంబంధాన్ని ప్రశ్నించగా, తిరిగి ఆమెతో పాటు మరో 13 మందిపై దొంగతనం కేసు మోపడం, వారం రోజుల క్రితం చిన్న యాక్సిడెంట్ విషయంలో కేసు పూర్తయ్యాక యువకుడిని పిలిపించి కొట్టడం, పది రోజుల క్రితం జంతు రవాణా కేసులో సర్దుబాటు పేరుతో ముద్దాయిలను వదిలేసారూ లాంటి ఆరోపణలు, ప్రజల ఆవేదనలు కూడా ఉన్నాయి. వీటికి తోడు బయట కొందరు యువకులను మధ్యవర్తులుగా పెట్టుకొని పోలీసులు సర్దుబాట్లు జరుపుతున్నారన్న ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా "వేణుగోపాలుడి బృందం" అనే గుంపు ఓ స్థాయి అధికారుల వరకు అందుబాటులో ఉండి, అంతర్గత – బాహ్య సెటిల్మెంట్లలో పాలుపంచుకుంటున్నట్టు సమాచారం కూడా వెలువడుతుంది. ఇలాంటి ఎన్నో ఆరోపణలు, కొన్ని నిజమైన ఘటనలు ఒకదాని వెంట మరొకటి ఇక్కడి సిబ్బందిపై బహిర్గతమవుతున్నా, పైస్థాయి అధికారులు మాత్రం మౌనం వహించడం ప్రజల్లో తీవ్ర అనుమానాలను రెక్కెత్తిస్తోంది.

## మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కూల్చివేత

(మొదటి పేజీ తరువాయి...)



పరికరాలు, పేలుడు పదార్థాలు, యంత్రాలు ఇతర సాంకేతిక వనరులను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలు : నిలువు మిల్లింగ్ యంత్రం ఒకటి, బి జి ఎల్ లాంచర్ (పెద్దది) రెండు, బి జి ఎల్ హెడ్స్ 94, బి జి ఎల్ షెల్ (ఖాళీ) 12, ట్రిగ్గర్ మెకానిజం, రైఫిల్ బట్, గ్రైండర్ మెషిన్, ఐ ఈ డి పైపులు మూడు, సోలార్ బ్యాటరీ నాలుగు, గ్యాస్ కట్టర్లు, బోర్ వెల్ డ్రిల్ బిట్స్, ఇనుప స్క్రాప్ లు, అచ్చు కుండలు, ఉక్కు పైపులు ఇతర పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



## భద్రాచలం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి

**భద్రాచలం, సెప్టెంబరు 27, ప్రజాజ్యోతి :** భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా తగ్గుతోంది. శనివారం ఉదయం 10 గంటలకు 48.8 అడుగులకు వరకు పెరిగిన నీటిమట్టం అనంతరం నిలకడగా ఉండి క్రమేపి తగ్గుతోంది. అలాగే భద్రాచలం నుంచి చర్ల మార్గంలో తూరుబాక, బుర్రవేముల వద్ద, కూనవరం రహదారిలో మార్గంలో ఏపీలోని మురుమూరు వద్ద రోడ్డుపై వరద నీరు పారుతుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాలో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరికి గడిచిన రెండు రోజులుగా ఆకస్మాత్తుగా వరద నీరు వచ్చి చేరింది. భద్రాచలం వద్ద సాయంత్రం 5 గంటలకు 44.50 అడుగుల వద్ద నీటి ప్రవాహం కొనసాగుతోంది. క్రమంగా తగ్గుతూ తెల్లవారుజాము వరకు మొదటి ప్రమాద హెచ్చరిక దిగువకు చేరే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. భద్రాచలంలో శుక్రవారం రాత్రి తరువాత మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పట్టణంలోని నీటిని బయటకు పంపే విస్తా కాంప్లెక్సు వద్ద మోటార్లు ఆన్ అవలేదు. దీంతో ఆ నీరంతా రామాలయ పరిసరాలను ముంచెత్తింది. దీంతో నిత్యన్నదాన సత్రం మొత్తం మురికినీటితో నిండిపోయింది. అలాగే రామాలయ పరిసరాల్లో ఉన్న బొమ్మల కొట్లు, విస్తాకాంప్లెక్సు దుకాణ సముదాయం, హోటళ్లన్నీ నీట మునిగాయి. దీంతో ఉదయం 8 తురువాత మోటార్లు అన్చేసి నీటిని గోదావరిలోకి వదిలారు. సమాచారం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, దేవస్థానం ఈవో దామోదర్రావులు వచ్చి పరిసరాలను పరిశీలించడంతో పాటు నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. ఇదిలా ఉండగా అధికారుల ముందు చూపు లేకపోవడం వల్లనే విస్తా కాంప్లెక్సు పరిసరాల్లోకి వరద నీరు వచ్చిందని





బీఆర్ఎస్ మండల కన్వీనరు ఆకోజు సునీల్, సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు పేర్కొన్నారు.

# ఏటీసీ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్,సెప్టెంబర్27, (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలం కృష్ణ సాగర్ గ్రామంలో రూ.4కోట్ల 70లక్షల వ్యయంతో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటిసీ)ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువతకు ఈ ఏటీసీ సెంటర్ ఒక గొప్ప అవకాశంగా మారాలని ఆకాంక్షించారు. యువత ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో శిక్షణ పొంది, ప్రపంచంలోనే అత్యాధునిక మిషనరీ సాంకేతిక పరిజ్ఞానంలో ముందుండాలని ఆయన ఉద్ఘాటించారు. ఈ కేంద్రం ద్వారా శిక్షణ పొందిన యువత ఉన్నత నైపుణ్యాలతో ప్రపంచ వేదికపై పోటీపడగలరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మచారి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు కైపు శ్రీనివాసరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, భజన సతీష్, చల్లా వెంకట నారాయణ, ఇంగువ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



**భద్రాచలం, సెప్టెంబరు 27,ప్రజా జ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రోత్సవ ప్రయుక్త విజయదశమి వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారు ధాన్యలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్రనామ పారాయణం వైదిక సిబ్బంది పఠించారు. చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్రావు వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. నేడు అమ్మవారు విజయలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## మండల అభివృద్ధి కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో సమావేశం

- పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు.



**జూలూరుపాడు, సెప్టెంబర్ 27 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పక్షాల నాయకులతో ఎంపీడీవో తాళ్లూరి.రవి సమావేశం నిర్వహించి వారితో ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు మహిళా రిజర్వేషన్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ బిజెపి,సిపిఐ సిపిఎం తెలుగుదేశం పార్టీ నాయకులు మంగీలా నాయక్, గుండుపిండి వెంకటేశ్వర్లు, యాస నరేష్,రోకటి బాబు, నిమ్మటూరు రామారావు హాజరయ్యారు.

## ప్రాథమిక వైద్యశాల ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ఆళ్ళపల్లి. సెప్టెంబర్ 27ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో శనివారం ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ సంఘమిత్ర ఆధ్వర్యంలో ఏడవ రోజు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యశాల సిబ్బంది ఆశ వర్కర్లు తో కలిసి ఆసుపత్రి ప్రాంగణంలో రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను అలంకరించి సాంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ వేడుకను నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ రేవంత్ ఆసుపత్రి సిబ్బంది ఆశ వర్కర్లు అంగన్వాడీ టీచర్లు 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కార్మికుల గోడు... గిరిజన ఎమ్మెల్యేలకు పట్టదా?



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 27, ప్రజా జ్యోతి:** గిరిజన కార్మికులు పదిహేను రోజులుగా సమ్మె చేస్తూ పోరాటం కొనసాగిస్తున్నా అధికారపార్టీ గిరిజన ఎమ్మెల్యేలకి ఈ గోడు పట్టకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. బ్రహ్మాచారి ప్రశ్నించారు. శనివారం ఐటిడిఏ వద్ద నిర్వహించిన సమ్మె శిబిరం వద్దకు వచ్చిన ఆయన మాట్లాడుతూ గిరిజన కార్మికుల జీతాలను తగ్గించి, పది నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం హాస్టల్ వర్కర్లను రోడ్డున పడేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు, ఐదుగురు గిరిజన ఎమ్మెల్యేలున్నా కార్మికుల సమస్యల పరిష్కారంపై ఎటువంటి ఒత్తిడి తేవకపోవడం గిరిజన జాతికి ద్రోహం చేయడమేనని విమర్శించారు. జీతాలు తగ్గించే జీఓ 64, జీఓ 527లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, గతంలో లేని సమస్యలను సృష్టించి హాస్టల్ వర్కర్ల నోటికాడ బువ్వ గుంజుకోవడం ఘోరమని మండిపడ్డారు. వర్కర్ల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీపీఎం పట్టణకమిటీ సభ్యుడు భూపేందర్, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పండాల మంగమ్మ, కుమారి, లక్ష్మి , దర్మమ్మ, రామారావు, ఈశ్వర్, వెంకట్ , నరేందర్ పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ వార్డుల రిజర్వేషన్లపై అవగాహన సమావేశం



**పాల్వంచ(రూరల్), సెప్టెంబర్ 27,ప్రజా జ్యోతి:** పాల్వంచ మండల పరిషత్ లో జరిగిన సమావేశంలో గ్రామపంచాయతీల్లో వార్డు వారీగా రిజర్వేషన్ల వివరాలను ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి పార్టీ ప్రతినిధులకు వివరించారు.ఈ సందర్భంగా శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి రిజర్వేషన్లు ఏ విధంగా ఖరారు చేసినట్లు పూర్తి వివరణ ఇచ్చారు.మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్‌డీసీ శారద,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రి సేవలు అమూల్యం

- పట్టణ ఎస్సైలు రామకృష్ణ, తిరుపతిరావు



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 27, ప్రజా జ్యోతి:** పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న గ్రీన్ భద్రాద్రి సేవలు అమూల్యమని పట్టణ ఎస్సైలు రామకృష్ణ, తిరుపతిరావు అన్నారు. శనివారం గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో పట్టణంలోని ట్రాఫిక్ స్టేషన్ ఎదుట మొక్కలు నాటిన అనంతరం వారు మాట్లాడుతూ గత పద్నాలుగు ఏళ్లుగా పట్టణంలో నిరంతరంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తూ, భద్రాచలాన్ని హరిత భద్రాద్రిగా తీర్చిదిద్దిన ఘనత వారికే దక్కుతుందని అన్నారు. గ్రీన్ భద్రాద్రి వారితో కలిసి మొక్కలు నాటటం తమకెంతో గర్వంగా ఉందని, మున్ముందు మరిన్ని పర్యావరణ హిత కార్యక్రమాలు చేపట్టాలని, వాటికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు చిట్టే లలిత, కోఆర్డినేటర్ పామరాజు తిరుమలరావు, పాస్ట్ ప్రెసిడెంట్ కామిశెట్టి కృష్ణార్జునరావు, తిప్పన సిద్ధులు మాస్టార్, రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పరిమి సోమశేఖర్, బిర్రు సుధాకర్, చందు, నవీన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రొసీడింగ్ అధికారులకు శిక్షణ పూర్తి

- పాల్గొన్న వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు

**జూలూరుపాడు,సెప్టెంబర్ 27 (ప్రజా జ్యోతి) :** జూలూరుపాడు మండల కేంద్రంలో గల కన్యక పరమేశ్వరి హాల్లో గ్రామపంచాయతీ లో జరిగే స్థానిక ఎన్నికలకు ప్రొసీడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలో స్థానిక ఎన్నికలు ఏ క్షణానైనా జరగవచ్చు అని వాటికి సిద్ధంగా ఉండాలని మండల పరిషత్ అధికారి తాళ్లూరి.రవి శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమానికి వివిధ డిపార్ట్మెంటు నుంచి అధికారులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ రూమ్ వాసుల సమస్యలను పరిష్కరించండి



**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 27, ప్రజా జ్యోతి:** డబుల్ బెడ్ రూమ్ వాసుల సమస్యలపై, పేద ప్రజల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సిపిఎం బృందం ముందు మనుబోతుల చెరువు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వాసులు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. వరద ముంపు పేరుతో కరకట్ట ప్రక్కన ఉన్న అయ్యప్ప కాలనీ వాసులను ఖాళీ చేయించి మనుబోతుల చెరువు వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేశారని, అప్పటినుండి అందులో చేరిన తాము తీవ్ర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అన్ని ఇండ్లకు డ్రైనేజీ వ్యవస్థను సెప్టిక్ ట్యాంకులతో కలపడంతో ట్యాంకులు నిండి దుర్వాసనతో వస్తుందని దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, వీధిలైట్లు లేకపోవడం, కరెంటు మీటర్ల బిల్లులు వేలల్లో రావడం, ఫ్రీ కరెంటు ఇవ్వకపోవడం తో తాము ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి గ్రామపంచాయతీ అధికారులను సంప్రదించగా ఇది ఐటీడీఏ పరిధి అని, ఐటీడీఏ అధికారులు చూడాలని చెప్పారని, పీవోకి దరఖాస్తు చేసినా ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మాస్ లైన్ కార్యక్రమంలో భాగంగా సిపిఎం నాయకులు ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, సున్నంగంగా తదితరులు కాలనీని సందర్శించి వాసుల సమస్యలను విన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. కాలనీ వాసులు భద్రమ్మ, కుమారి సహా పలువురు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**కొత్తగూడెం, సెప్టెంబర్ 27(ప్రజాజ్యోతి):** కొత్తగూడెం పట్టణంలోని గొల్ల గూడెం ప్రాంతం రాజీవ్ గృహకల్పలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు,స్థానికుల సమాచారం ప్రకారం షేక్ ఇబ్రహీం(43) మద్యానికి బానిసగా మారాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా దూరవాట్లు మానుకోవాలని భార్య రేహానా పలుమార్లు చెప్పింది. అయినా ఇబ్రహీం మారకపోవడంతో సుమారు 15 రోజుల క్రితం పుట్టింటికి వెళ్ళింది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇబ్రహీం ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇబ్రహీం కార్ డ్రైవర్ గా పని చేస్తూ ప్రస్తుతం కోళ్ల ఫారంలో దినసరి కూలిగా వెళుతున్నట్లు తెలిసింది.మృతుడికి భార్య, ఇంటర్ చదివే కూతురు,10వ తరగతి చదివే కుమారుడు ఉన్నారు. భార్య రెహానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ సీఐ శివప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎలక్షన్లలో పొరపాట్లు లేకుండా విధులు నిర్వహించాలి

- ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి





**పాల్వంచ(రూరల్),సెప్టెంబర్ 27,ప్రజా జ్యోతి:** జగన్నాధపురం పెద్దమ్మగుడి వద్ద దృశ్య ప్రెసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న సర్పంచ్,మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు (ఎంపీటీసీ),జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు (జడ్పీటీసీ) ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా,నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి సూచించారు.ఈ సందర్భంగా ప్రెసైడింగ్ అధికారులు సమయపాలన పాటించాలని, అనుమానాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేయాలని సూచించారు.శిక్షకులు సాయి కృష్ణ,పార్థసారథి,ప్రకాశ్‌రావు ప్రెసైడింగ్ అధికారుల విధులు,బాధ్యతల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ సుధా లక్ష్మి,ఎంపీఓ చెన్నకేశవులు, యూడీసీ వీరబాబు పాల్గొన్నారు.

## ఈ నెల 29, 30న సింగరేణి సఫాయి కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం



**కొత్తగూడెం సింగరేణి, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 27:** సింగరేణిలో పని చేస్తున్న సఫాయి కార్మికులకు ఈ నెల 29,30 న సింగరేణి ప్రధాన ఆసుపత్రి లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు చీఫ్ మెడికల్ అధికారి ఆర్. కిరణ్ రాజ్ కుమార్ శనివారం తెలిపారు. ' స్వచ్ఛత హి సేవా ' కార్యక్రమంలో భాగంగా ' సఫాయి సురక్ష సివిర్స్ ' అనే నినాదం తో భారత ప్రభుత్వ గృ మరియు పట్టణ వ్యవహారాలు , జల శక్తి , మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాల మన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్.బలరామ్, డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు సూచనల మేరకు సింగరేణి సంస్థలో పనిచేసే రెగ్యులర్, కాంట్రాక్టు సఫాయి కార్మికులకు మరియు వారి కుటుంబ సభ్యులకు అన్ని ఏరియా ఆసుపత్రులలో వివిధ తేదీలలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందనీ వివరించారు. అందులో భాగంగా కార్పొరేట్ మరియు కొత్తగూడెం ఏరియా లలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు సఫాయి కార్మికులకు , వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు ఈ నెల 29,30 లలోప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలకు వచ్చే వారు ఆయా తేదీలలో రక్త పరీక్షల కోసం ఉదయం 8 గంటల లోపు రావాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీ ఆర్. కిరణ్ రాజ్ కుమార్ తెలిపారు.

# పంట కోసం కంటనీరు

- చేలోకి వెళ్లాలా... యూరియా కోసం తిరాగాల
- ప్రశ్నిస్తే యూరియా సరఫరా బంద్ చేస్తామని రైతులతో పిఎసిఎస్ సిబ్బంది వాగ్వివాదం



**టేకులపల్లి, సెప్టెంబర్ 27,ప్రజా జ్యోతి:** వ్యవసాయం అంటే రైతుకు ఎందుకు మక్కువ అని ఎవరైనా అడిగితే ఎమ్ చెప్తాం.. అది వారికున్న ఇష్టం అని చెప్తామా. బతుకుదెరువు చేతకాక వేరే పని చేసుకోలేక చేసుకుంటున్నారు.. అని చెప్తామా.. ఏది ఏమైనా.. రైతు చేతికి బురద అంటకపోతే మన చేతికి అన్నం ముద్ద రాదు.. అటువంటి రైతు వేసిన పంట వదిలి యూరియా కోసం తిరుగుతున్నాడు.. ఎందుకు యూరియా ఇవ్వట్లేదు అంటే యూరియా ఇవ్వం.. అంటున్నారంటే.. ఏమనుకోవాలి.. టేకులపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ బేతంపూడి సొసైటీ వద్ద నానో యూరియా తీసుకుంటేనే యూరియా ఇస్తామని పీఏసీఎస్ అధికారులు అనడంతో పిఎసిఎస్ సిబ్బందితో రైతులకు వాగ్వివాదం శనివారం చోటుచేసుకుంది. రెండు కట్టలకు ఒక నానో యూరియా తీసుకోవాలని రైతులను ఒత్తిడి చేస్తున్నారని రైతులు ఆరోపించారు. రోజుల తరబడి తిరుగుతుంటే రోజుకు ఒక్క యూరియా కట్టనే ఇస్తున్నారని, వేసిన పంట చూసుకోవాలో లేక యూరియా కట్టల కోసం తిరగాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కట్టలు ఇవ్వాలని, మీ ఆధార్ కార్డు బ్లాక్ చేస్తానని, యూరియా కట్టలు ఇవ్వడమే బంద్ చేస్తామని పీఏసీఎస్ సిబ్బంది అన్నట్లు రైతులు ఆరోపించారు. పక్క మండలంలో భూములు ఉండి ఇక్కడ లోన్లు నివాసం ఉండి ఆధార్ కార్డు ఉన్న యూరియా కట్టల అందజేయడం లేదని, ఆ మండలంలోని పిఎసిఎస్ వద్ద యూరియా కట్టలు తీసుకోవాలని పిఎసిఎస్ అధికారులు అంటున్నట్లు రైతులు ఆరోపించారు. క్యూలైన్లో వచ్చిన వాళ్ళకు ఇవ్వకుండా యూరియా కట్టలను ఫోన్ ద్వారా పక్కదారి పట్టిస్తున్నారని రైతులు ఆరోపించారు.తప్పని సరిగా నానో యూరియా తీసుకోవాలని పీఏసీఏస్ సిబ్బంది అంటున్నారని, పత్తి చేను పంట ఆగం అవుతుందని,నానో ఎలా వాడలని ప్రశ్నిస్తున్నారు. పంటను కోతులు ఆగం చేస్తున్నాయని, ఇటు సొసైటీ చుట్టు తిరిగి తిరిగి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.

### పీఏసీఏస్ అధికారులను వివరణ కోరగా ...

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక యూరియా బస్తా కు ఒక నానో యూరియా బాటిల్ను ఇవ్వాలన్నట్టు అధికారులు పీఏసీఏస్ సిబ్బందికి సూచించినట్లు వారు తెలిపారు. వారు తెలిపిన విధంగా రైతులకు ఒక యూరియా బస్తా కు ఒక నానో యూ రియా బాటిల్ను ఇంతవరకు ఇవ్వడం జరిగింది. అయితే రైతుల పంటల ముదరడం వల్ల నానో యూరియా వద్దని ఆందోళన చేయగా సొసైటీ ఛైర్మన్ లక్కినేని సురేందర్ రావు కలగజేసుకొని నానో యూరియా ను ఇవ్వద్దని అధికారులకు తెలిపారు. అంతటితో ఆ గొడవ సద్దుమణిగింది అని అధికారులు తెలిపారు.

## పత్తి చేనును ధ్వంసం చేసిన ఫారెస్ట్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య



**ఆళ్ళపల్లి సెప్టెంబర్ 27ప్రజాజ్యోతి :** మండల పరిధిలోని రాయపాడు గ్రామానికి చెందిన ఓకే నాగేశ్వరావు అనే రైతు పత్తి చేను రాత్రికి రాత్రే ఆటవిశాఖ అధికారులు ధ్వంసం చేయడం అమానుషమైన చర్య అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య అన్నారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం (బి కే ఎం యు,) నాయకులు ఊకె నాగేశ్వరరావు కు చెందిన ధ్వంసం అయిన పత్తి చేనును పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసలే అధిక వర్షపాతం తో రైతులు పంట నష్టపోయి అనేక ఇబ్బందులు పడుతుంటే మరోపక్క ఆటవిశాఖ అధికారులు చేతికొచ్చిన పంటను నేలమట్టం చేయడం సరైంది కాదన్నారు. లక్షలకు లక్షలు అప్పులు తెచ్చుకొని సాగు చేసుకుంటున్న పంటలను ఇలా ధ్వంసం చేయడం ఏంటి అని ప్రశ్నించారు. నష్టపోయిన రైతుకి నష్టపరిహారం అందించాలని అలాగే పోడు పట్టా కలిగి ఉన్న పంట నష్టం చేసిన ఆటవిశాఖ అధికారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ఎన్డి జిల్లా నాయకులు జీ. రాంచందర్, కోరం వెంకటేశ్వర్లు. సిపిఐ మండల నాయకులు హనుమంతరావు పి వై ఎల్ నాయకులు గొగ్గెల పాపారావు మాజీ కో ఆప్షన్స్ సభ్యుడు ఎస్.కె రహీం గుంతోజు శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## శేషగిరి భవన్ ఆవరణలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

- మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



**కొత్తగూడెం, సెప్టెంబర్ 27(ప్రజాజ్యోతి):** భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్ ఆవరణలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా, జీవనాడిగా ప్రతీ ఏటా జరుపుకునే బతుకమ్మను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పూలను పేర్చి బతుకమ్మను తయారు చేసి అరుణ పతాకం ఎగురుతుండగా నృత్యాలు చేశారు. చిన్నారులు చేసిన కోలాట నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు ఎస్.కె సాబీర్ పాషా, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ వేడుక అద్దం పడుతుందని, మహిళలంతా ఒక వేదిక వద్దకు చేరుకుని పండుగ వాతావరణంలో ఐఖ్యతను చాటడం అభినందనీయం అన్నారు. ప్రకృతితో ముడిపడి ఉన్న ఈ వేడుక వాతావరణంలో ఆరోగ్యకరమైన పలు మార్పులను తీసుకొస్తుందని తెలిపారు. బతుకమ్మ సంబురాల సాక్షిగా మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలని, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అన్యాయాలు అక్రమాలపై భారతజాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించి తోటి మహిళలకు అండగా నిలవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, జి వీరస్వామి, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, రత్నకుమారి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఘాట్ ఏర్పాట్లు పరిశీలించిన సీఐ వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం, సెప్టెంబర్ 27(ప్రజాజ్యోతి):** లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ముర్రేడు వంతెన వద్ద బతుకమ్మ ఘాట్ ఏర్పాట్లను సీఐ రాయల వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులకు తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ .కే. సాబీర్ పాషా, ఉత్సవ కమిటీ సభ్యులు కోనేరు పూర్ణచంద్రరావు, శ్రీనగర్ కాలనీ మాజీ ఉపసర్పంచ్, లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు లగడపాటి రమేష్ చంద్, అన్వర్ పాషా, మూల్పురి ప్రసాద్, వీర చారి, ప్రవీణ్, కోడూరు రమేష్, జగన్, కాశయ్య, నరేష్, తేలిక పుల్లయ్య, పల్లపోతూ సాయి బాబా, లక్ష్మీదేవి పల్లి ఎస్ ఐ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వంశీ తదితరులు పాల్గొన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



**ఇల్లందు, సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి:** తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ పేర్కొన్నారు. పట్టణంలోని జగదాంబ సెంటర్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శనివారం సెంటర్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దిండిగల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణలో పురుడుపోసుకున్న అన్ని ప్రజా ఉద్యమాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రత్యక్ష సాక్షి అని, తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదురించి, ఎలుగెత్తి చాటిన అతి తక్కువమంది నాయకుల్లో అగ్రగణ్యులు కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. మూడు తరాల ఉద్యమ వారధి బాపూజీ అని, దేశ స్వాతంత్ర్యం కోసం, నిజాం విముక్త తెలంగాణ కోసం, ప్రత్యేక తెలంగాణ అవతరణ కోసం నినదించిన నిప్పుల గొంతుక అని తెలిపారు. 96 ఏళ్ల వయసులోనూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పోరాడాడని, తెలంగాణ గడ్డమీద పుట్టి, దేశ చరిత్ర పుటల్లో కెక్కిన మహానుభావులలో ఒకడిగా బాపూజీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. రంగనాథ్, అబ్దుల్ నబీ, ఎర్రబెల్లి కృష్ణయ్య, దేరంగుల పోషం, రాచపల్లి శీను, మూలగుండ్ల ఉపేందర్, జబ్బార్, సన రాజేష్, నారపాక వసంత్, తుంగపల్లి మహేష్, లలిత్ కుమార్ పాసి, కిషన్ లాల్ పాసి సుందర గిరి శీను, పరిక పల్లి రవి, గడ్డి శ్రీను, బాబా, రాము, నారపాక యాకయ్య, మునిగంటి శివ, వడ్డేపల్లి నిఖిల్, సర్వేష్, ఖాజా, బజారు సత్యనారాయణ, చిన్నారి, ఆయుష్ పాసి, రాంలాల్ పాసి, బిబి, నూర్జహాన్ , మదర్ బి, ఉమా, బొప్పి భాగ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలి





**ఇల్లందు, సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి:** సద్దుల బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. శనివారం ఇల్లందులపాడు చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపాలిటి అధికారులను కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన 7వ రోజు బతుకమ్మ వేడుకకు హాజరై మహిళాలతో కలిసి డ్యాన్స్ వేసి సోదరిమణులలో ఉత్సహం నింపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ అంకుషావలి, మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, హరిహరక్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, ఇల్లందు పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియల్, ప్రధాన కార్యదర్శి జాఫర్,.మాజీ మున్సిపల్ చైర్మన్ యదళ్లపల్లి అనసూయ, నియోజకవర్గ నాయకులు మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్ రావు, స్వరూప, పూనెం సురేందర్, అముదాల ప్రసాద్, ప్రసన్న కుమార్, బానోత్ శారద, కల్తీ పద్మ, పాయం స్వాతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**ఇల్లందు, సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి:** భారతదేశ స్వాతంత్ర సమరయోధులు, నిరంకుశ నిజాం వ్యతిరేక తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖులైన నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖులైన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యమకారుడు అనే పదానికి నిలువెత్తు నిర్వచనం కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి దేశం అంతట ప్రజలు ఆనందోత్సవాలలో పాల్గొన్నప్పటికీ తెలంగాణ ప్రజలు నిత్యం నిజాం ఆకృత్యాలకు లోనై ఉండటాన్ని చూసి విమోచన ఉద్యమంలో పోరాడి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ పై, పౌర హక్కులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ అధ్యక్షుడిగా సిటిజన్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసి ప్రజా చైతన్య కార్యక్రమాలు రూపొందించారని గుర్తు చేశారు. తొలి, మలి తరం తెలంగాణ ఉద్యమాల్లో ముందుండి నడిపించే తొలినాళ్లలో సమైక్యవాది అయినప్పటికీ ఆంధ్ర పాలకుల వివక్షణ స్వయంగా ఎదుర్కొని తన అభిప్రాయాలను మార్చుకొని 1969 నాటి తెలంగాణ విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహించారని, 1996 నుండి మొదలైన మలిదశ ఉద్యమానికి కూడా అండగా నిలిచారని, 2001 ఏప్రిల్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యం లోనే టీఆర్ఎస్ పార్టీ పురుడు పోసుకుందని, జై తెలంగాణ నినాదం ఎత్తుకున్న వారందరికీ అండగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, దాస్యం ప్రమోద్, జెకె శ్రీనివాస్, దేరంగుల పోశం, గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, రవి కాంత్, బొడ్డుపల్లి సతీష్, మీరజాబేగ్, బజారు సత్యనారాయణ, పూదూరి లక్ష్మీనారాయణ, ఈశ్వర్, గైని శ్రీహరి, లోడుంగి రాహుల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరు ఊరంతా ఉయ్యాలో... పూల వనమయే ఉయ్యాలో

- ఆడపడుచుల ఆత్మగౌరవానికి చిహ్నం బతుకమ్మ సంబరాలు
- వేపకాయల బతుకమ్మగా గౌరమ్మను పూజించిన మహిళలు



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి:** ఆడపడుచుల ఆత్మగౌరవానికి చిహ్నమైన బతుకమ్మ సంబరాలు ఏడో రోజుకు చేరుకున్నాయి శుక్రవారం వేపకాయల బతుకమ్మగా గౌరమ్మతో ఆడబిడ్డలు ఆడి పాడారు. ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నాన బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ సంబురాలను ముగించుకున్న మహిళలు వేడుకల్లో ఏడో రోజైన వేపకాయల బతుకమ్మగా జరుపుకుంతున్నారు. “వాడవాడంత ఉయ్యాలో.. పూల వనమాయే ఉయ్యాలో" అంటూ తంగేడు, గునుగు, చామంతి, గులాబి పూలతో ఏడంతరాలు పేర్చి ఆడుకుంటున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేకుండా ప్రతి వీధిలో రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో కలకలాడుతున్నాయి.



## ఖరారైన రిజర్వేషన్లు... ఆశావహులకు చుక్కెదురు

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 27, ప్రజా జ్యోతి** జిల్లాలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావాదుల్లో చుక్కెదురైంది, ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా రిజర్వేషన్ల వివరాలను వెల్లడించింది, జిల్లాలో 22 మండలాలు ఉండగా జడ్పిటిసి స్థానాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీల వారిగా రిజర్వేషన్లు వెల్లడించారు, ఇప్పటివరకు జెడ్పిటిసి స్థానాలకు పోటీ చేసేందుకు రాజకీయంగా తమ వ్యూహాలను వేసుకుంటూ వచ్చారు, రిజర్వేషన్ల ప్రక్రియను ఆలోచించకుండా తమ పలుకుబడి ప్రాబల్యాన్ని చాటుకుంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు, ఆయా పోటీలలో ఉన్న వ్యక్తులు పోటీలో దిగేందుకు తమ ఎత్తుగడలను వేసుకుంటున్నారు, ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు ప్రకటించడంతో వారి ఆశలన్నీ అడియాశలు అయ్యాయి, 22 జడ్పిటిసి లకు గాను మహిళలకు 10 స్థానాలు కేటాయించారు, ఎస్టి మహిళలలో రెండు జెడ్పిటి స్థానాల్లో ఎస్టీ మహిళకు 5 స్థానాలు, బీసీ మహిళలకు మూడు స్థానాలు, జనరల్ స్థానాల్లో ఒకటి మహిళలకు, మిగతా 12 స్థానాలు ఎస్సీ, ఎస్టీ పురుషులకు కేటాయించగా ఇప్పటివరకు ఆయా మండలాలలో జడ్పిటిసి స్థానాలపై ఆశలపెట్టుకున్న వారికి నిరాశ ఎదురయింది, ఎంపీపీ స్థానాల్లో కూడా ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ స్థానాల్లో పదిమంది మహిళలకు కేటాయించారు, జడ్పిటిసి, ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ముందుగానే కార్యాచరణలో ఉన్న వారి ఆశావాదులకు చుక్కెదురైంది, రిజర్వేషన్లు ప్రకటించడంతో రాజకీయం ఒకసారిగా వేడెక్కింది, రాజకీయ నాయకులు అభ్యర్థుల కోసం సమాలోచనలు చేయటం ఇప్పటికే ప్రారంభించారు, ఇప్పటివరకు అనుకున్న వ్యక్తులకు బదులుగా రిజర్వేషన్ల కేటగిరీలో అనుకూలించకపోవడంతో వారిని బొజ్జగించి కొత్త అభ్యర్థుల కోసం అన్వేషించడం ప్రారంభమైంది.

## ప్రకృతిశక్తికి ప్రతీక లలితాదేవి

- ఈ అమ్మను సేవిస్తే సర్వ సౌభాగ్యాలు సిద్ధిస్తాయి.. అర్చకులు పుండరీకాక్ష
- 6వ రోజు లలిత త్రిపుర సుందరీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి:** లలితా దేవి ప్రకృతి శక్తికి ప్రతి కానీ నవరాత్రులలో అమ్మను ఈ రూపంలో సేవిస్తే సర్వ సౌభాగ్యాలు సిద్ధిస్తాయని అర్చకులు పుండరీకాక్ష అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నియోజకవర్గ వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆశ్వయుజ శుద్ధ సప్తమి రోజు కావటంతో దుర్గాదేవి, శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం, శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీ కోదండ రామాలయం, గుర్రాల చెరువు గ్రామ శివారులోని స్వయంభుగా వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, డ్రైవర్స్ కాలనీలోని శ్రీ కనకదుర్గమ్మ తల్లి, ఆలయాలతో సహా పలు ఆలయాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- అమ్మను ఈరోజు సేవిస్తే అత్యున్నత స్థితి లభిస్తుంది.... అర్చకులు కే పుండరీకాక్ష

కనకదుర్గమ్మ తల్లిని నవరాత్రులలో లలిత త్రిపరసుందరి దేవిగా సేవిస్తే భక్తులకు అత్యున్నత స్థితులు లభిస్తుందని ఈ అమ్మ నెలవంకైనా కిరీటం ధరించి దర్శనమిస్తుందని సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అమ్మవారి ఉత్సవమూర్తి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు పుండరీకాక్ష అన్నారు. లలిత త్రిపుర సుందరి అమ్మవారు పై రెండు చేతులలో పాశం అంకుశం కింది చేతులలో చరకబిందు అలాగే ఐదు పువ్వుల బాణాలు ధరిస్తారని మన చుట్టూ ఉండే పంచ భౌతిక శక్తి లలిత అని పంచభూతాలన్ని ఒక దానిలో ఒకటి ఇమిడి ఉంటాయని అమ్మవారి శక్తిని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు శ్రీ షిర్డీ సాయిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి



**ఇల్లందు, సెప్టెంబర్ 27, ప్రజాజ్యోతి:** నిరుద్యోగ యువతకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ ద్వారా ఉపాధి కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉమ్మగాని హరీష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోనినెంబర్ 2 బస్తీలో గల భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలను పురస్కరించుకొని పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులు పూర్తి చేసుకొని వేలమంది నిరుద్యోగులు సంవత్సరానికి సుమారు 50వేల మంది బయటకి వస్తున్నప్పటికీ సరైన ఉపాధి లేక ఈ రాష్ట్రంలో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఖనిజ నిక్షేపాలు పుష్కలంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరితో ఈ ప్రాంతంలో బొగ్గు బావులను కూడా మూసివేసే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం, గుండాల కాంచనపల్లిలో బొగ్గు నిక్షేపాలు, ఇల్లందు పరిసర ప్రాంతాల్లో గ్రానైట్ ఉన్నప్పటికీ చిన్నపాటి పరిశ్రమలు పెట్టుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని, ఇక్కడి నుండి సంవత్సరానికి వేల మంది హైదరాబాద్, ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నప్పటికీ సరైన ఉపాధి లేక ఒక పూట పస్తులు ఉంటూ వారి జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చిన ఏదో చేస్తామని చెప్పేవాళ్ళు తప్ప చేసి చూపించిన వాళ్ళు లేరని, కనీసం ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమైన ఈ ప్రాంతంలో ఉన్న ఖనిజ నిక్షేపాలను వెలికి తీసే విధంగా, ఈ ప్రాంతాన్ని జనరల్ ప్రాంతంగా గుర్తించి రిజిస్ట్రేషన్ సౌకర్యాలు కల్పిస్తే ఇక్కడ ఉపాధి అవకాశాలు రావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి అనిల్ యాదవ్, ఇల్లందు టౌన్ వైస్ ప్రెసిడెంట్ యాకేష్, ఏఐవైఎఫ్ ఇల్లందు నాయకులు, ఖాసిం, నిరోష్, శివ, గణేష్, శశి, సాగర్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెడ్డినాయక్ జన్మదిన వేడుకలు

- టేకులపల్లి మండల ప్రజల అభిమాన నాయకుడు



**టేకులపల్లి, సెప్టెంబర్27, ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ ఇస్లావత్ రెడ్డి నాయక్ శనివారం జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు.రెడ్డి నాయక్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య తో సహా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మ వారిని ప్రార్థిస్తున్నానంటూ మండల ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు.ఈ కార్యక్రమంలో అభిమానులు, టేకులపల్లి మండల కేంద్ర ప్రజలు పాల్గొన్నారు.

## కేటీఆర్ ని కలిసిన కాంపెల్లి కనకేష్ పటేల్

**పాల్వంచ(రూరల్), సెప్టెంబర్ 27, ప్రజా జ్యోతి:** పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావును హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ,రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని, రైతులకు సరిపడా ఎరువులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతుల సమస్యలపై కట్టుదిట్టంగా నిలబడాలని,రుణమాఫీ అమలు పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు.అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి జిల్లా పరిషత్ పీఠం కైవసం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలపై వారిని నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.ప్రజల్లోకి వెళ్లి ఉద్యమాలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.



# పొంగి ప్రవహించిన వాగులు.. నిలిచిన రాకపోకలు..



**టేకులపల్లి, సెప్టెంబర్27, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో శుక్రవారం రాత్రంతా ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురిసింది.శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుండపోతగా కురిసింది.దీనితో వాగులు,వర్రెలు పొంగి ప్రవహించి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.తుర్పుగూడెం మీదుగా రైల్వే స్టేషన్ బేతంపూడి వెళ్లే మార్గంలోని రాళ్లవాగు పొంగి ప్రవహించడంతో మూడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.రోళ్లపాడు – ప్రధాన రహదారి మధ్యలో ఉన్న మూడు వంకల వాగులు పొంగి రోళ్లపాడు, రుక్మతండా, బీల్యాతండా గ్రామాల ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పుణ్యపు వాగు పొంగి అనిశెట్టిపల్లి సంపత్ నగర్ మార్గమధ్యలో రాకపోకలు నిలిచాయి. పాతలచగూడెం గంగారం గ్రామాల మధ్య ఉన్న ముర్రేడు వాగు పొంగి అక్కడకూడా రాకపోకలు నిలిచాయి.రాళ్ళవాగు, పెద్దవాగు, మద్దిరాలవాగు, ముర్రేడు ఇతర వాగులు పొంగాయి. మండలంలోని సింగరేణి కోయగూడెం ఉపరితల గనిలో మట్టి, బొగ్గు తీసే పనులకు అంతరాయం ఏర్పడింది. బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. టేకులపల్లిలో ప్రతి శనివారం నిర్వహించే వారాంతపు పశువుల సంత వర్షంతో వెలవెల పోయింది. పత్తి, మొక్కజొన్న పంటలకు వర్షాలతో తీవ్ర నష్టం ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మహిళల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం



**పాల్వంచ(రూరల్ ), సెప్టెంబర్ 27, ప్రజా జ్యోతి :** పాల్వంచ మండలం గుడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని డాక్టర్ హిమబిందు నేతృత్వంలో జరిగింది.ఈ సందర్భంగా 9వ వార్డు గ్రామాల మహిళల కోసం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఆప్తాల్మాలజిస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రతిభ,డాక్టర్ హారిస్‌లు ఆరోగ్య సమస్యలపై మెరుగైన వైద్య సలహాలు,సూచనలు అందించారు.జి ఎస్ ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు అరేం ప్రశాంత్ మాట్లాడుతూ,ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించి,వారికి మెరుగైన వైద్య సేవలు,చికిత్సలు అందించడం జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమం మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు కుటుంబాలు, సమాజం ఆరోగ్యంగా ఉండేలా చూడటం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సి ఓ నాగమణి,భాస్కర్,సంధ్య,కోరేం రమేష్,గుడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యాధరి ఫౌండేషన్ కు రూ.10 వేలు విరాళం



**కొత్తగూడెం, సెప్టెంబర్ 27, ప్రజా జ్యోతి :** కొత్తగూడెంలోని విద్యాధరి ఫౌండేషన్ కు మహిళా కానిస్టేబుల్ రూ. 10 వేలు విరాళంగా అందజేశారు. బూర్గంపాడు పోలీస్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్ గా పనిచేస్తున్న బి. పావని, విద్యాధరి ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు బైరి రాజేష్ ఖన్నాకు శనివారం కొత్తగూడెంలో అందజేశారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ పావని మాట్లాడుతూ విద్యాధరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతోమంది పేదలకు, మారుమూల ప్రాంత ఆదివాసీలకు, అనాధలకు ఉపయోగపడుతున్నాయన్నారు. తనవంతుగా సహాయ సహకారమందించే దానిలో భాగంగా రూ. 10000 విరాళం అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ ఉండి ఉన్నత చదువులు చదువుకోలేని విద్యార్థినీ విద్యార్థులకు చేయూతను అందిస్తున్నామని తెలిపారు. దీంతోపాటుగా పేద ప్రజలకు, అనాధలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు, అనాధలకు ఫౌండేషన్ తరపున సహాయ సహకారాలు అందించాలనుకునేవారు ఫౌండేషన్ సభ్యులు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాధరి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ కలలు యువత సాకారం చేయాలి

- సమ సమాజ స్థాపనకు యువత మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలి
- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లిక్కి బాల రాజు,కాలంగి హరికృష్ణ
- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి



**కొత్తగూడెం, సెప్టెంబర్ 27( ప్రజాజ్యోతి):** భగత్ సింగ్ కలలు కన్న సమ సమాజ స్థాపనకు యువత మరో స్వాతంత్ర పోరాటానికి సిద్ధం కావాలనీ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాళంగి హరికృష్ణ పిలుపునిచ్చారు.కొత్తగూడెంలో శనివారం జరిగిన భగత్ 118 జయంతి కార్యక్రమాలలో వారు పాల్గొని మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం చిన్న వయసులోనే చిరునవ్వుతో ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు.స్వాతంత్ర్యం పట్ల స్పష్టమైన అవగాహనతో భగత్ సింగ్ పోరాటం చేశాడని అన్నారు. దేశానికి కావాల్సింది రాజకీయ స్వాతంత్ర్యం కాదని ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చినప్పుడే ప్రజలు ఆత్మ గౌరవంతో బ్రతుకుతారని మనడే భగత్ సింగ్ స్వాతంత్రం పట్ల తన వైఖరిని ప్రకటించాలని తెలిపారు. నేటి పాలకులు స్వాతంత్ర దినోత్సవ స్ఫూర్తికి విగాథం కలిగిస్తూ ఈ దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతూ నూటికి 90 శాతం మంది ప్రజలను పేదరికంలోకి నెట్టివేసే విధానాలు అవలంబిస్తున్నారని ఆరోపించారు. యువతకి ఉపాధి అవకాశాలు కల్పించే ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ దేశ సంపదను నాశనం చేస్తున్నారని వారు విమర్శించారు. కులమత ప్రాంత రాజకీయాలు పెరిగిపోయాయని, ఈ రాజకీయాల వల్ల యువత పెడదారి పడుతున్నారని, స్వచ్ఛమైన రాజకీయాల కోసం భగత్ సింగ్ స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల కోసం కొట్లాడేందుకు యువత పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.విద్య ఉపాధి ఉద్యోగాల కోసం యువత పోరాటాలకు రావాలని, యువతను పెడదారి పట్టించేందుకు సినిమాలు, సీరియల్స్, బెట్టింగ్ యాప్లు, సోషల్ మీడియా లాంటివి, వీటితో పాటుగా మద్యం మాదక ద్రవ్యాలు గుట్కా లాంటివి జీవితం చెడగొడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే భగత్ సింగ్ స్ఫూర్తితో యువత పోరాటాల్లో కొచ్చి విద్యా ఉపాధి కోసం పోరాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు విజయ్, మోహన్ సింగ్ఉ, పెర్ల ప్రశాంత్, సతీష్, వేణు తదితరులు పాల్గొన్నారు.